# హమ్మయ్య..!

• ప్రశాంతంగా ముగిసిన లష్కర్ బోనాలు
• ఊపిరి పీల్చుకున్న అధికారులు

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలు అంటేనే తెలంగాణా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ప్రతి ఏడాది లక్షల మంది అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ ఏడాది కూడా సుమారు 10లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బోనాల జాతరలో గత పదేళ్ల నుంచి స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నీ తానై వ్యవహరించి బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేసేవారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు ఇటీవల చనిపోవడంతో ఆయన మొదటి నుంచి బోనాల ఉత్సవాలకు దూరంగా ఉన్నారు. దీనికి తోడు డీసీపీతో సహా పోలీసు అధికారులందరూ కొత్త వాళ్లు రావడంతో అంతా కొత్తగా అయిపోయింది. అధికారులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లే బాధ్యత పూర్తిగా ఎవరూ తీసుకోకపోవడం, ఉత్సవ కమిటీ సభ్యులు కొత్త వారు కావడంతో జాతర ఎలా జరుగుతుందోనని స్థానికులు భావించారు. అంతకు ముందు బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం కల్యాణంలో తోపులాట జరుగడం, భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురైన సంగతి తెలిసిందే. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ జాతరపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. ఇక దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ వచ్చారు. గత నాలుగు పర్యాయాలు జాతర నిర్వహించిన అనుభవం ప్రస్తుత ఈవో మనోహర్‌రెడ్డికి ఉండటం, గతంలో ఇక్కడ పనిచేసిన అన్నపూర్ణను ఆఫీసర్‌గా నియమించడంతో పకడ్బందీగా ఏర్పాట్లు, భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కూడా ప్రత్యేక దృష్టి సారించి డీసీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులకు ప్రత్యేక సూచనలు చేయడంతో ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు కూడా లేకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

# మీ సేవలు అపూర్వం

## బదిలీపై వెళ్తున్న గాంధీ వైద్యులు, సిబ్బందికి ఘన సన్మానం



ఆర్ఎంఓ-1 జయకృష్ణకు సన్మానం చేస్తున్న రాజారావు, రమేష్‌రెడ్డిలు



గాంధీ మెడికల్ కాలేజీ వద్ద పదోన్నతి, బదిలీపై వెళ్తున్న వైద్యులు, సిబ్బంది

గాంధీఆస్పత్రి: మెరుగైన వైద్యం అందించి, నిరుపేద రోగులకు పునర్జన్మ ప్రసాదించిన మీ సేవలను వెలకట్టలేమని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డిలు అన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సెమినార్‌హాలులో సోమవారం పదోన్నతి పొందిన, బదిలీపై వెళ్తున్న వైద్యులు, సిబ్బందికి శాలువ కప్పి ఘనంగా సన్మానించి, ప్రశంసపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గాంధీ వైద్యులు, సిబ్బంది నిరంతరం శ్రమకోర్చి, చిత్తశుద్ధి, సమయపాలనతో విధులు నిర్వహించి నిరుపేదలకు మంచి వైద్యం అందించి గాంధీఆస్పత్రి, మెడకల్ కాలేజీల పేరుప్రఖ్యాతులను విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. కరోన కష్టకాలంలో ప్రాణాలకు తెగించి వేలాది మందికి పునర్జన్మ ప్రసాదించిన అపరబ్రహ్మలని, వారు అందించిన సేవలను గుర్తించి పూలవర్షం కురిపించారని గుర్తు చేశారు. పదోన్నతి పొంది బదిలీపై వెల్తున్న గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీకు చెందిన సుమారు వంద మంది వైద్యులు, సిబ్బందికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ–1 జయకృష్ణల తోపాటు పలు విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ రిలీవ్

గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజారావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి సోమవారం సాయంత్రం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఇటీవల జరిగిన కౌన్సెలింగ్‌లో వీరు ఇరువురిని యాదాద్రి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలకు బదిలీ చేశారు. సోమవారం సాయంత్రం ఉత్తర్వులు అందుకున్న వారు ఇక్కడ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

## నేడు శాకంబరి ఉత్సవాలు



సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని మధురానగర్ శ్రీబంగారు మైసమ్మ దేవాలయంలో ఈనెల 23న శాకంబరి వేడుకలు నిర్వహించన్నుట్టు ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆషాఢమాసం సందర్భంగా కూరగాయలతో అమ్మవారిని ఆలయాన్ని అలంకరించి శాకంబరి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే వేదపండితుడు బొద్దూరు స్వామి రాజేశ్వరశర్మ నేతృత్వంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చలను నిర్వహిస్తున్నట్టు పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అమీర్‌పేట: ఆషాడమాసములో ముడవ వారం బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని శాకాంబరిగా అలంకరించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి అంజనీదేవి, చైర్మన్ సాయిబాబాగౌడ్ తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. భక్తులకు ఉదయం 7గంటల నుండి అమ్మవారి దర్శనము కల్పిస్తామని అన్నారు.

## ఘనంగా వట్టిపల్లి కోటేశ్వర్‌రెడ్డి జయంతి



సికింద్రాబాద్: పేదల మాస్టారుగా పేరు గడించిన సీతాఫల్‌మండి అమరావతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు వట్టిపల్లి కోటేశ్వర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అమరావతి పాఠశాలల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ర్యాలీగా సీతాఫల్‌మండి కూడలిలోని కోటేశ్వర్‌రెడ్డి విగ్రహం వద్దకు తరలివచ్చి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ సీతాఫల్‌మండి, చిలకలగూడ ప్రాంతాల్లోని పేదలకు కోటేశ్వర్‌రెడ్డి ఉచితంగా అందించిన విద్యా సేవలను కొనియాడారు. ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులకు కోటేశ్వర్‌రెడ్డి ఆశయాలు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో అమరావతి విద్యా సంస్థల నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, ప్రసన్నలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, కవితారెడ్డి, వేంకటేశ్వర్‌రెడ్డి, వీణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్కు అభివృద్ధికి పాటుపడాలి

పద్మారావునగర్: పద్మారావునగర్ పార్కు సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరు కలిసి రావాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి అన్నారు. పద్మారావునగర్ పార్కులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్కును అన్ని విధాలా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన కమిటీ అధ్వర్యంలో పార్కు సర్వతోముఖాభివృద్ధికి నిర్దిష్టమైన కార్యచరణలో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎం.పి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో పార్కును అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు యోగా గురువులను అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రావు, క్రిష్ణయాదవ్, కుషాల్, మధుసూదన్‌రెడ్డి, క్రిష్ణ, వాసు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పార్కులో యోగా గురువులను సత్కరించిన అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మల్లంపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు డ్రీమ్ వ్యాలీకాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, అకాష్ లేఅవుట్, మల్లంపేట్ గ్రామం, ఏపీఆర్ విల్లాస్, 11కేవీ బాలాజీ ఎన్‌క్లేవ్ పీడర్ పరిధిలో బాలాజీ ఎన్‌క్లేవ్, ఖాజీపల్లి రోడ్డు, ప్రణీత్ జెమ్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

## మురికివాడలను అభివృద్ధి చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలో మురికివాడలను అభివృద్ధి చేయాలని సౌతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఓయూ ప్రొ.గాలి వినోద్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం క్యాంపస్‌లోని లా కాలేజీ ఎదుట గల డాక్టర్.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మూసినదితో పాటు మురికివాడలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తే 30 లక్షల మందికి మేలు జరుగుతుందన్నారు. మురికివాడల్లో విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి స్థిర నివాసాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## హెచ్‌సీయూకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ పేరు పెట్టాలని జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఓయూలో జై ఆగస్టు 11న రవీంద్రభారతీలో జరిగే పాపన్న 374వ జయంతి ఉత్సవాలు వాల్ పోస్టర్‌ను డా.రామారావుగౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21 కోటలు నిర్మించి గోల్కొండను పాలించిన పాపన్న మహారాజ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గౌరవం ఇవ్వాలన్నారు.

## కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. (కిలోల్లో) టమాటా రూ.51, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 23, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 32, పందిరి బీర 18, క్యాబేజీ 23, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 21, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 8, అరటికాయ 9, మునగకాయ 9, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## బాసాని శ్రీనివాస్‌రావుకు పురస్కారం



సికింద్రాబాద్: సీతాఫల్‌మండికి చెందిన సామాజిక కార్యకర్త బాసాని శ్రీనివాస్‌రావుకు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా అనే ఎన్‌జీఓ సంస్థ నంది అవార్డును సోమవారం బహూకరించి సత్కరించింది. ఏటా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వ్యక్తులకు ఎంపిక చేసి సత్కరించే కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాసాని శ్రీనివాస్‌రావుకు నంది అవార్డును అందించారు.

## సందడి చేసిన అంతర్జాతీయ చెఫ్ వికాస్ ఖన్నా



సనత్‌నగర్: అంతర్జాతీయ చెఫ్ వికాష్ ఖన్నా సనత్‌నగర్‌లోని ఆగ్రోమెక్ స్టీల్ ఫ్యాక్టరీలో సోమవారం సందడి చేశారు. కుక్‌వేర్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న బెర్గ్‌నర్ ఇండియా ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ఆయన ఆగ్రోమెక్ స్టీల్ ఫ్యాక్టరీ వద్ద నూతన బెర్గ్‌నర్ షోరూంను ప్రారంభించడంతో పాటు సరికొత్త ఉత్పత్తులను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా చెఫ్ రంగంలో తన అనుభవాలను ఆయన పంచుకున్నారు. అమృత్‌సర్‌లో చిన్న హోటల్‌లో ప్రారంభమైన తన కెరీర్ అమెరికా వరకు ఎదిగిన తీరును వివరించారు. చాలా ఏళ్ల తరువాత హైదరాబాద్‌లోని ఆగ్రోమెక్‌కు రావడం సొంత ఇంటికి వచ్చామన్న భావన కలుగుతుందన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత పెరిగిందని, ఈ క్రమంలో ఏ పాత్రలు వాడితే ఆరోగ్యం బాగుంటుందనే విషయాలపై ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు.

## కుంగిన మ్యాన్ హోల్.. పట్టించుకోని అధికారులు



ఆదిత్యనగర్ నడి రోడ్డుపై కుంగి పోయిన మ్యాన్ హోల్

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్ ప్రధాన రహదారిలో మ్యాన్ హోల్ కుంగిపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు వేగంగా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు.రాత్రి సమయంలో పాదచారులు సైతం అందులో పడి గాయాల పాలవుతున్నారన్నారు. రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్ హోల్‌కు మరమ్మత్తులు చేసి బాగు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కాలనీ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ అన్నారు.ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## మురుగు సమస్యను పరిష్కరించండి



సికింద్రాబాద్: బోనాల వేడుకలు సమీపిస్తున్న తరుణంలో సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ వాసులకు మురుగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. బీదలబస్తీలోని శ్రీరేణుకాఎల్లమ్మ దేవాలయంలో ఈనెల 28,29 తేదీల్లో బోనాల వేడుకలు జరుగనున్నాయి. ఈ తరుణంలో బీదలబస్తీ ప్రధాన రహదారి మొదలు అంతర్గత రహదారులు మురుగునీటి ప్రవాహాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మ్యాన్‌హోల్స్ నుంచి లీక్ అవుతున్న మురుగనీరు రహదారులపై ప్రవహిస్తూ స్థానికులకు అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. పలు మార్లు జీహెచ్ఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి బోనాల వేడుకలకు ముందే రహదారులపై మురుగునీటి సమస్యలు దూరం చేయాలని బీదలబస్తీ వాసులు కోరుతున్నారు.

## కోలాహలంగా ఫలహార బండ్ల ఊరేగింపు



ఓల్డ్‌బోయిగూడలో ఫలహార బండి ఊరేగింపులో యువత నృత్యాలు

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరలో భాగంగా ఫలహార బండ్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది. ఆదివారం, సోమవారం రాత్రి సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి సాగిన ఫలహార బండ్ల ఊరేగింపు ఆద్యంతం ఆకట్టుకుంది. రెజిమెంటల్‌బజార్, మోండా, టకారా బస్తీ, రాంగోపాల్‌పేట్, పాన్‌బజార్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఫలహారబండ్లను ఊరేగింపు చేశారు. అమ్మవారి ఫలహారాన్ని బండిలో ఉంచి వాటి ముందు డీజే సౌండ్, మేళతాళాలు, డప్పుల దరువులు, విచిత్ర వేషాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలతో హోరెత్తాయి.

## అందరి సహకారంతో బోనాలు విజయవంతం: మంత్రి పొన్నం

రాంగోపాల్‌పేట్: అన్ని శాఖల అధికారులు, పోలీసులు, భక్తులు, వాలంటీర్ల సహకారంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర విజయవంతమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రంగం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాలకు నిధులు పెంచినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో పాడిపంటలు పుష్కలంగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అమ్మవారు ఆశీర్వదించినట్లు చెప్పారు. కాగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర దిగ్విజయంగా, ప్రశాంతంగా ముగియడం పట్ల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఫలహార బండ్ల నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టండి

బౌద్ధనగర్: బోనాల పండుగ సందర్భంగా డివిజన్‌లోని దేవాలయాల వద్ద ఏర్పాటు చేయనున్న లైటింగ్‌ను కార్పొరేటర్ కంది శైలజ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరేటర్ కంది శైలజ ఆదేశించారు. స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌తో కలిసి పలు దేవాలయాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేస్తున్న లైట్లను పరిశీలించారు.

## జాతరలో దొంగల చేతివాటం

రాంగోపాల్‌పేట్: మహంకాళి బోనాల జాతరలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. అటు మార్కెట్, ఇటు మహంకాళి పోలీస్ స్టేషన్ల పరిధిలో పలువురి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు, నగదును తస్కరించారు. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి చెందిన ఒకటిన్నర తులం బ్రాస్‌లైట్, మరో వ్యక్తికి చెందిన మూడు తులాల చైన్ కూడా కొట్టేశారు. ఒక జర్నలిస్టుకు చెందిన రూ.4వేల నగదును తస్కరించారు. 2 మొబైల్ ఫోన్లు కూడా జేబుదొంగలు కొట్టేశారు. కానీ మరికొంత మంది మొబైల్ ఫోన్లు పోయినా కూడా ఎలాంటి ఫిర్యాదులు చేయుండా వెళ్లిపోయారు.

**ముగ్గురు సెల్‌ఫోన్ దొంగల అరెస్టు**

సెల్‌ఫోన్లను తస్కరిస్తున్న ముగ్గురు సెల్‌ఫోన్ దొంగలను మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. మహంకాళి బోనాల జాతర సందర్భంగా నిర్వహించే ఫలహార బండ్ల ఊరేగింపులో ఈ మహిళలు చేతివాటాన్ని ప్రదర్శించి సెల్‌ఫోన్లు దొంగిలించారు. వారి నుంచి 7 ఫోన్లు స్వాధీనం చేసికున్నారు. అయితో ఫోన్లు పోయినట్లు ఇంత వరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని పోలీసుల తెలిపారు. ఐఎంఈ నంబర్ల ద్వారా ముగ్గురు బాధితులకు వాటిని అప్పగించగా మిగతా వాటిని గుర్తించాల్సి ఉంది.

## ఎల్ఎల్‌బీ పరీక్ష ఫీజును తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: పెంచిన ఎల్ఎల్‌బీ పరీక్ష ఫీజును తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఓయూ అధికారులకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య మాట్లాడుతూ గతంలో ఉన్న రూ.1230 సెమిస్టర్ పరీక్ష ఫీజును రూ.1550 పెంచారని, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును రూ.350 నుంచి రూ.950 వరకు పెంచారన్నారు. రెండు సంవత్సరాల క్రితం ట్యూషన్ ఫీజులు పెంచిన ఓయూ అధికారులు ఇప్పుడు పరీక్ష ఫీజులు పెంచడం సరికాదన్నారు.

## యువకుడి ఆత్మహత్య

అమీర్‌పేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. వనపర్తికి చెందిన తరుణ్‌కుమార్‌రెడ్డి (18) బాపూనగర్‌లోని వెంగమాంబ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ సీఏ కోచింగ్ తీసుకుంటున్నాడు. తరుణ్‌రెడ్డి రెండేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. కడుపునొప్పి అధికం కావడంతో గండి మైసమ్మ ప్రాంతంలో ఉన్న సోదరి సుస్మితకు మంగళవారం ఉదయం ఫోన్ చేసి కడుపునొప్పి భరించలేక పోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. రూమ్‌మెట్స్ వచ్చి గదిలోకి వెళ్లి చూడగా 108కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గదిలో సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.అనారోగ్య కారణాల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నాని నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## బాలిక అదృశ్యం

రాంగోపాల్‌పేట్: హోం నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైంది. మహంకాళి పోలీసుల కథనం ప్రకారం.. పార్క్‌లేన్‌లో మీనాక్షి (14) అనే బాలిక ఉంటూ పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. ఈ నెల 2వ తేదీన ఎంవీఎఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రిడ్జి కోర్సు కోసం ఈ బాలికను ఇక్కడ చేర్పించారు. అయితే ఈ నెల 20న బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో హోం ప్రతినిధులు అన్ని చోట్ల గాలించినా ఎక్కడ ఆచూకీ కనిపించకపోవడంతో మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?



తుకారాంగేట్‌లో రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలేసిన దృశ్యం



లాలాపేట బస్తీల్లో పాడైన అంతర్గత రోడ్లు

లాలాపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. లాలాపేటలోని లోతట్టు ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే అంతర్గత రోడ్లు పాడై గుంతలు ఏర్పడ్డాయి. వరద నీటి ప్రవాహానికి మ్యాన్ హోళ్ల వద్ద మట్టి కొట్టుకుపోయి పైకి తేలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నెల 28న ఈ ప్రాంతాల్లో బోనాల వేడుకలు జరుగనున్నాయి. పాడైన రోడ్ల గుండా ఫలహార బండ్లు ఊరేగింపుకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. మరి కొన్ని ప్రాంతాల్లో వరద ప్రవాహానికి కోట్టుకువచ్చిన మట్టి, బురద రోడ్లపై పేరుకుపోయింది. ఈ వచ్చే ఆదివారం ఈ ప్రాంతంలో బోనాల వేడుకలున్నాయి. కావునా అధికారులు స్పందించి వెంటనే రోడ్ల మరమతులు చేపట్టాలనీ స్థానికులు కోరుతున్నారు.

**రోడ్డుకు మరమ్మతులు చేయండి**

అడ్డగుట్ట: సీవరేజీ పనుల నిమిత్తం ఆరు నెలల క్రితం తవ్విన రోడ్డుకు సరైన మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు పలు అవస్థలు పడుతున్నారని తుకారాంగేట్ వాసులు వాపోతున్నారు. మీనా హాస్పిటల్ పక్కనున్న వీధిలో ఆరు నెలల క్రితం సీవరేజీ పైప్‌లైన్ పనులు చేశారు. పనుల అనంతరం, సదరు రోడ్డుకు మరమ్మతులు చేయకుండా అలాగే నామమాత్రంగా పనులు చేసి వెళ్లిపోయారు. దీంతో అక్కడ పూర్తిగా తవ్విన రోడ్డు వ్యర్థాలు పైకి రావడంతో వాహనాలు, స్థానిక వాసుల రాకపోకలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు, నాయకులు ఎవ్వరూ కూడా సమస్యను పరిష్కరించడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

## సెల్‌ఫోన్ దొంగలకు ఏడాది జైలుశిక్ష

సికింద్రాబాద్: రైలు ప్రయాణికుడిని గాయపరిచి అతడి సెల్‌ఫోన్ దొంగిలించిన కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సికింద్రాబాద్ రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ ఎండి గౌస్‌పాషా సోమవారం తీర్పు చెప్పారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... చిలకలగూడకు చెందిన వై.చందు కిమ్స్ ఆసుపత్రి ఉద్యోగి. 2023 ఆగస్టు 11న ఆసుపత్రి విధులు ముగించుకున్న చందు ఎంఎంటీఎస్ రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్నాడు. మూత్రవిసర్జన కోసం రైలు పట్టాల వెంబడి కొంతదూరం నడుస్తూ నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లాడు. అనుసరించిన ముగ్గురు వ్యక్తులు చందును బంధించి తనిఖీ చేయగా నగదు లభించలేదు. దీంతో అతడిపై దాడికి పాల్పడి గాయపరిచిన నిందితులు తన సెల్‌ఫోన్‌ను లాక్కొని వెళ్లి పోయారు. చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులు ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ సోహెల్ (25), చాంద్రాయణగుట్టకు చెందిన పవన్‌పవార్ (23), మెహదీపట్నంకు చెందిన మాణిక్య రమేశ్ (28)లను గుర్తించి వారి నుంచి సెల్‌ఫోన్ రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించిన రైల్వేకోర్టు మెజిస్ట్రేట్ ఏడాది జైలుశిక్ష, రూ.200 నగదు జరిమానా విధించారు. కోర్టు తీర్పు ఆధారంగా ముగ్గురు నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.